# విపశ్యన మాసపత్రిక

VOLUME:24 NO - 15 1 JUNE, 2019

**(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70**


**"ధర్మవాణి"**

*"సబ్బే సంఖారా దుక్ఖా "తి, యదా పఞ్ఞాయ పస్సతి !*
*అథ నిబ్బిన్దతి దుక్ఖే, ఏస మగ్గో విసుద్ధియ !!*

*– ధమ్మపదపాళీ – 278, మగ్గవగ్గో*

సంస్కరింపబడిన (తయారయిన) ప్రతీదీ ఎప్పటికైనా అంతమవ్వాలి కాబట్టి అది వ్యాకులతకే కారణం అవుతుంది. ఈ సత్యాన్ని విపశ్యన చేసి ప్రజ్ఞతో చూసిన వారికి ఈ దుఃఖ ప్రపంచం పట్ల అనాసక్తత వస్తుంది. విశుద్ధులవ్వాలంటే ఇదే మార్గం.

## బుద్ధుని బోధనలేమిటి?

### మూడవ వ్యాఖ్యానము, మొదటి భాగం (14 అక్టోబర్ 1951)

– శ్రీ సితు సయాజీ ఊ బా ఖిన్

(రంగూన్‌లోని పగోడా రోడ్డున కల మెథడిస్ట్ చర్చిలో ధర్మజిజ్ఞాసకుల సభలో బర్మా ప్రభుత్వ అకౌంటెంట్ జనరల్ శ్రీ సితు సయాజీ ఊ బా ఖిన్, మూడు వ్యాఖ్యానాలిచ్చారు. వాటి అనువాదాన్ని ఇక్కడ క్రమ సంఖ్యలో ప్రచురిస్తున్నాము.) – హిందీ అనువాదకుడు, సత్యనారాయణ గోయంకా

**బుద్ధుని బోధనలు**

సజ్జనులారా, సన్నారీమణులారా,

నేను "ప్రతీత్య సముత్పాదము" (సకారణ ఉత్పత్తి) మరియు ''పట్ఠాన'' (కార్యకారణ సంబంధం) గురించి ఏ కొద్దిగానైనా వివరించకుంటే, "బుద్ధుని బోధనలేమిటి?" అన్న విషయంపై నేను చేస్తున్న వ్యాఖ్యా పూర్తైనట్లు అనిపించుకోదు.

నా మొదటి ప్రవచనం చివరలో తపస్వీ రాజకుమారుడైన సిద్ధార్థ గౌతముడు ఏ విధంగా సమ్యక్ సంబోధిని పొంది సమ్యక్ సంబుద్ధుడు అయ్యాడో వివరించాను. నేను అక్కడ చెప్పిన దానిని మరొక్కసారి గుర్తుకు తెచ్చుకుందాం. రాజకుమారుడు సిదార్థుడు వాస్తవంగానే సమ్యక్ సంబోధిని ప్రాప్తింపచేసుకుని సమ్యక్ సంబుద్ధుడయ్యాడు–మేల్కొన్నాడు, వెలుగుతో నిండిపోయాడు, సర్వజ్ఞుడయ్యాడు. ఆయన మేల్కొన్న విషయంతో పోలిస్తే ఇతర ప్రాణులందరూ గాఢనిద్రలో కలలో భ్రమిస్తున్నారనుకోవాలి. ఆయన వెలుగుతో నిండిన దానితో పోలిస్తే ఇతరులందరూ చీకటిలో కొట్టుమిట్టాడుతున్నారు అనాలి. ఆయన పొందిన సర్వజ్ఞతో పోలిస్తే ఇతర ప్రాణులందరికీ తెలిసినదల్లా అవిద్యనే అని అనుకోవాలి.

అన్ని మతాల వారూ సత్యానికి చేర్చే మార్గాన్నే తెలుపుతున్నామనే పలుకుతారు. నిస్సందేహంగా సత్యాన్ని చేరుకోవటమే అందరీ లక్ష్యం. బుద్ధుని బోధనల ప్రకారం కూడా ఒక వ్యక్తి పరమార్థ సత్యాన్ని (నాలుగు ఆర్యసత్యాలను) స్వయంగా సాక్షాత్కారం చేసుకోనంత వరకూ అవిద్యలో మునిగి ఉన్నట్లే. ఈ అవిద్యనే సంస్కారాలకు జన్మనిస్తుంది. ఈ సంస్కారాల నుండే ప్రతి ప్రాణిలోనూ విజ్ఞానరూప జీవనధార ప్రవహిస్తుంది. విజ్ఞానరూప జీవనధార మొదలవగానే నామ–రూపాలు ఒకదానికొకటి ఆధారంగా నిలిచి, కలిసి ముందుకుసాగుతాయి. వీటి కలయికతో రూపుదిద్దుకున్న శరీరం ***"షడాయతన"*** (ఆరు ఇంద్రియాలకు) కారణమవుతుంది. ఈ ఇంద్రియాలు స్పర్శ ఉత్పత్తికి కారణమవుతాయి. ఈ ఇంద్రియాలతో వాటికి సంబంధించిన విషయం స్పృశించగానే అది వేదనకు (సుఖము, దుఃఖము, అసుఖఅదుఃఖ) కారణమవుతుంది. వేదన కారణంగా తణ్హా (తృష్ణ) పుడుతుంది, తృష్ణ కారణంగా ఉపాదానము (తీవ్రమైన కోరిక) పుడుతుంది. ఈ ఉపాదానమే భవానికి (జనన మరణ చక్రానికి) కారణం. భవమే జననము, వృద్ధాప్యం, రోగము, మృత్యువు, శోకము, పరితాపము, బాధ మొదలగు వాటికి కారణం. ఇవన్నీ దుఃఖాలే.

ఈ విధంగా దుఃఖస్కంధానికి (దుఃఖ సమూహానికి) మూల కారణము అవిద్యనే అని బుద్ధుడు తెలుసుకున్నాడు.

భగవానుడు ఇలా చెప్పాడు –

"అవిద్యనే సంస్కారాలకు ప్రత్యయము (కారణము). సంస్కారాలు విజ్ఞానానికి ప్రత్యయము, విజ్ఞానము నామ–రూపాలకు ప్రత్యయము, నామ–రూపము షఢాయతనాలకు ప్రత్యయము. షఢాయతనాలు స్పర్శకు ప్రత్యయము. స్పర్శ వేదనకు ప్రత్యయము. వేదన తృష్ణకు ప్రత్యయము, తృష్ణ ఉపాదానానికి ప్రత్యయము, ఉపాదానము భవమునకు ప్రత్యయము. భవము, జన్మకు ప్రత్యయము, జన్మ ముసలితనం, రోగం, మరణం, శోకం, పరితాపం, బాధ మొదలగు దుఃఖాలకు ప్రత్యయము."

ఈ ఉత్పత్తి శృంఖలాన్నే ప్రతీత్య సముత్పాదము అంటారు. ఈ క్రమంలో ఉత్పన్నమయ్యే ప్రతి దాని మూలంలో అవిద్యనే ఉందని గమనించగలము. అవిద్య అంటే సత్యం తెలియకపోవటం. మనం కొన్నిసార్లు "దుఃఖానికి కారణం తృష్ణ" అని స్థూలంగా వర్ణిస్తుంటాము. ఇది ఎంతో సరళమైన విషయం. మనకేదైనా వస్తువు కావాలంటే మనసులో దాని పట్ల తృష్ణ పుడుతుంది. అలా తృష్ణ కలగగానే ఆ వస్తువును పొందటానికి ప్రయత్నం చేస్తాము, రకరకాల దుఃఖాలను ఎదుర్కుంటాము. కానీ ఇంతమాత్రమే తెలుసుకుంటే సరిపోదు. భగవానుడు ఇలా చెప్పాడు – "కేవలం అయిదు స్కంధాల కలయికకైన నామరూపాలు కూడా దుఃఖమే" అని. బుద్ధుని బోధనల ప్రకారం, నామరూపాలకు సంబంధించిన సత్యాన్ని కేవలం బయటకు అగుపించినతనే తెలుసుకుంటే సరిపోదు. లోపలా బయటా వీటిని వాస్తవిక రూపంలో తెలుసుకుంటేనే దుఃఖ ఆర్యసత్యాన్ని గురించి పూర్తిగా తెలుసుకున్నట్లు అవుతుంది.

కాబట్టి దుఃఖ ఆర్యసత్యాన్ని పూర్తిగా తెలుసుకోవాలంటే మొదట నామరూపాలను అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఒక ఉదాహరణతో

తెలుసుకుందాము. ఆధునిక విజ్ఞానం ప్రకారం ప్రపంచమంతా కూడా అసంఖ్యాకమైన విద్యుత్ కణాల కదలికలతో జనించిన ప్రకంపనలు మాత్రమే. అయితే, మన శరీరానికి కూడా ఈ సిద్ధాంతం వర్తిస్తుందనే విషయాన్ని మనలో ఎంత మంది అంగీకరిస్తారు? మరి మనతో స్వయంగా సంబంధమున్న ఈ సత్యాన్ని మనం అనుభవపూర్వకంగా ఎందుకు తెలుసుకోకూడదు? దానికోసం మన శారీరిక స్థితి నుండి మరింత ఎదిగి మన మానసిక శక్తులను వికసింప చేసుకుని వాస్తవాన్ని సరైన పద్ధతిలో నిరీక్షించగల యోగ్యతను సంపాదించాలి. వికసించిన మానసిక శక్తితో అత్యాధునిక యంత్రాలతో సైతం చూడలేనంత లోతుల వరకూ చూడగలము. మరి అలాంటప్పుడు మనలో ఏమి జరుగుతుందో, దాని వైపుకు దృష్టిని మళ్లించవచ్చు కదా. ఈ అణువులు, పరమాణువులు, విద్యుత్ కణాలు మొదలైనవి ఎలాంటి అంతరాయం లేకుండా, ప్రతిక్షణమూ ఎలా మారుతున్నాయో అని ఎందుకు చూడకూడదు? కానీ ఈ విధంగా లోపలికి చూడటం అంత సులభం కాదు.

నేను నా ఒకానొక శిష్యుని డైరీలోని ఒక అంశాన్ని చదివి వినిపిస్తాను. దానితో నిజానికి ఈ ఆంతరిక దుఃఖమంటే ఏమిటో మీకు తెలుస్తుంది. ఆ అంశం ఇలా ఉంది –

- 21-08-1951 – సాధన ప్రారంభించగానే, ఎవరో నా తలపైన డ్రిల్ మిషిన్‌తో రంధ్రం చేస్తున్నట్లు అనిపించింది. ఆ తర్వాత తలమీద అంతటా చీమలు పాకుతున్న అనుభూతి కలిగి గోకాలి అనిపించింది. కానీ గురూజీ అలా చేయవద్దని చెప్పారు. గంటసేపు సాధనలో నేరేడు రంగుతో తలతలా మెరుస్తున్న నీలం రంగు రేడియం పరమాణువులు మెల్లమెల్లగా నా శరీరం అంతటా నిండిపోయినట్లు అనిపించింది. ఆ తరువాత శూన్యాగారంలో ఏకధాటిగా మూడు గంటల పాటు ధ్యానావస్థలో ఉంటూ బయటి ప్రపంచం పట్ల పూర్తిగా సంజ్ఞా శూన్యమైపోయాను. సరిగ్గా అప్పుడే నా శరీరంలో ఒక భయంకరమైన కుదుపు వచ్చినట్లు అనిపించింది. నేను ఎంతో భయపడేవాడినే, కానీ సాధన కొనసాగిస్తూ ఉండమని గురూజీ నన్ను ప్రోత్సహించారు. నా శరీరమంతా ఎంతో వేడిగా ఉన్నట్లు, నా ప్రతి శరీర భాగంలోనూ విద్యుత్తు సూదులు గుచ్చుతున్నట్లు అనిపించింది.
- 22-08-1951 – ఈ రోజు కూడా సుమారు మూడు గంటల సాధనాక్రమంలో నా శరీరమంతా మంటల్లో చిక్కుకున్నంత బాధగా అనిపించింది. ఊదారంగుతో మిళితమైన నీలం రంగు కిరణాలు నా శరీరంపై నుండి క్రిందివైపుకు చొచ్చుకుపోతున్న అనుభూతి కలగటం జరిగింది. అప్పుడు నా గురువుగారు, నాకు వివరించారు – "శరీరంలో ఆగకుండా మార్పు చెందడం ఏదైతే ఉందో అది "అనిచ్చ". ఆ మార్పు వల్ల కలుగుతున్న బాధనే "దుఃఖ". ఈ బాధనే నుండే, ఈ దుఃఖం నుండే మనం ముక్తిపొందాలి."
- 23-08-1951 – మనమిప్పుడు ***(కాయానుపశ్యనా)*** స్థితికి చేరుకుంటున్నాము, కాబట్టి ప్రకాశ కిరణాలను ఆలంబనగా చేసుకోకుండా ఛాతీపై ధ్యానాన్ని కేంద్రీకరించమని మా గురువుగారు నన్ను ఆదేశించారు. నేను అలాగే చేసి, ఈ శరీరం దుఃఖంతో నిండియున్నదనే నిర్ణయానికి వచ్చాను.

సమాధి (ఏకాగ్రచిత్త) బలంతో విపశ్యన ద్వారా అంతర్ముఖులమై శరీరంలోపల జరిగే ఆణవిక ప్రకంపనలు, వికీరణాలు, సంఘర్షణలను, వాటి కారణంగా ఉత్పన్నమయ్యే తీవ్ర వేదనలను అనుభూతి చెందుతాము. అప్పుడే మన అంతరాల లోతుల వరకూ దుఃఖం యథార్థంగా అనుభూతిలోకి వస్తుంది. ఈ అనిత్య, దుఃఖ సత్యాలను తెలుసుకోలేకపోవటమే అవిద్య. ఈ అవిద్యనే దుఃఖానికి పుట్టినిల్లు. ఈ అవిద్యనే కార్య–కారణ శృంఖల ద్వారా జరా, వ్యాధి, దుఃఖము, పరితాము, వ్యాకులతలతో పరిపూర్ణమైనటువంటి జీవనధారను ప్రవహింప చేస్తుంది. అనిత్య, దుఃఖాలను అంతర్ముఖులై పరమార్థ రూపంలో తెలుసుకోవటమే ఈ అవిద్యను నశింపచేస్తుంది.

ఇంతవరకూ ప్రతీత్య సముప్పాదానికి, దుఃఖానికీ గల మూలకారణాన్ని గురించిన వివరణ ఇవ్వబడింది. ఇప్పుడు మనము కార్యకారణ సంబంధ నియమాలపై కూడా కొద్దిగా దృష్టి పెడదాము. దీనిని భగవానుడు, అభిధమ్మ పిటకలోని పట్ఠాన నీతిలో తెలిపారు. భగవానుడు సమ్యక్ సంబోధిని ప్రాప్తించుకుని 49 రోజులపాటు నిరంతరంగా ధ్యానం చేసినప్పుడు ఈ సిద్ధాంతాన్నే విశ్లేషణాత్మకంగా చింతన చేస్తుండగా ఆయన శరీరం నుండి ఆరు వర్ణాల కిరణాలు వెలువడ్డాయి. ఈ గంభీర విషయాన్ని గురించి పాళీ భాషలో ఐదు వందల పుటల పుస్తకాలు ఐదు ఉన్నాయి. ఇక్కడ వాటిని కేవలం పరిచయం మాత్రమే చేయగలను.

బుద్ధుని బోధనలలోని కార్యకారణ సిద్ధాంతానికి మూలాధారాలైనటువంటి ప్రత్యయాలు (కారణాలు) 24 ఉన్నాయి. అవి

| | |
|---|---|
| 1. హేతు ప్రత్యయము | 13. కర్మ ప్రత్యయము |
| 2. ఆలంబన ప్రత్యయము | 14. విపాక ప్రత్యయము |
| 3. అధిపతి ప్రత్యయము | 15. ఆహార ప్రత్యయము |
| 4. అనంతర ప్రత్యయము | 16. ఇంద్రియ ప్రత్యయము |
| 5. సమనంతర ప్రత్యయము | 17. ధ్యాన ప్రత్యయము |
| 6. సహజాత ప్రత్యయము | 18. మార్గ ప్రత్యయము |
| 7. అన్యమన్య ప్రత్యయము | 19. సంప్రయుక్త ప్రత్యయము |
| 8. నిశ్రయ ప్రత్యయము | 20. విప్రయుక్త ప్రత్యయము |
| 9. ఉపనిశ్రయ ప్రత్యయము | 21. అస్తి ప్రత్యయము |
| 10. పురేజాత ప్రత్యయము | 22. నాస్తి ప్రత్యయము |
| 11. పచ్ఛాజాత ప్రత్యయము | 23. విగత ప్రత్యయము |
| 12. ఆసేవన ప్రత్యయము | 24. అవిగత ప్రత్యయము |

ఇప్పుడు నేను హేతు మరియు కర్మలకు గల పారస్పరిక సంబంధాల గురించి, వాటి కారణంగా ఉత్పన్నమయ్యే కర్మఫలము గురించి నేను అర్థం చేసుకున్న దానిని మీకు వివరిస్తాను.

మనోవాక్కాయ కర్మలు ఆచరించే ప్రతిక్షణం, మనము వాటికనుగుణమైన మనోస్థితిని కలిగి ఉంటాము. అదే ఆ కర్మలకు సంబంధించిన హేతువు. అదేవిధంగా ప్రతి ఒక్క కర్మా ఒక ప్రత్యేక మనోస్థితి ఉత్పన్నమవటానికి కారణం అవుతుంది. అవి కుశలమే కావచ్చు లేదా అకుశలం కూడా కావచ్చు. బుద్ధుని బోధనల ప్రకారం వీటినే మనం కుశల ధర్మాలు, అకుశల ధర్మాలు, అబ్యాకత ధర్మాలుగా పిలుస్తాము. ఈ ధర్మాలు ఏమిటి? ఇవి మానసిక శక్తులు మాత్రమే. ఇవన్నీ కలిసి సంస్కారలోకాన్ని నిర్మిస్తాయి. దీని గురించి మొదటి ప్రవచనంలో వివరించాను.

కుశల శక్తులు – దానము, సేవ, శ్రద్ధ, చిత్త విశుద్ధి లాంటి కుశల వృత్తులతో అనుప్రేరితమైన మనోవాక్కాయ శుభకర్మల ద్వారా ఉత్పన్నమౌవుతుంది.

అకుశల శక్తులు – తృష్ణ, కోరిక, కోపము, ద్వేషము, అసంతోషం, వంచన మొదలగు ఋణాత్మక వృత్తులతో ప్రేరితమైన మనోవాక్కాయ అశుభ కర్మల ద్వారా ఉదయించేది.

అబ్యాకత శక్తులు – ఇది అర్హంతుల మనోస్థితి. కుశలమూ అకుశలమూ కాని స్థితి. అవిద్యను పూర్తిగా నశింప చేసుకున్న అరహంతుల

నిత్యస్థితి ఇదే. అర్హంతులైన వారికి, వారి ఇంద్రియవిషయాలు సంపర్కంలోకి వచ్చినప్పుడు, తద్వారా ఉత్పన్నమయ్యే వేదన (అనుభూతి) ఏలాంటి ధర్మానికీ అంటే కుశలానికి కానీ, అకుశలానికి కానీ కారణమవ్వదు. అంటే అది తృష్ణ ఉత్పన్నమవటానికి అవసరమైన బలమైన ప్రభావాన్ని కలిగించదు. నిరంతరం ప్రవహిస్తూ ఉండే నీటి ప్రవాహంలో ఏ విధంగానయితే ప్రతిబింబం అగుపించదో, అలాగే అర్హంతులకైతే తమ శరీరమంతా నిరంతరంగా మార్పు చెందుతూ ఉండే పరమాణువులరాశిలాగా అనుభవమౌవుతూ ఉంటుంది. అందుకే దీనిపై పడిన ఏ ముద్రైనా ఈ పరమాణువులరాశితోపాటే విఘటితం అయిపోతుంది.

రండి, మనమిప్పుడు సహేతుక కర్మల ద్వారా ఉత్పన్నమైన కుశల మరియు అకుశల శక్తులకు, వేర్వేరు ప్రాణి లోకాలతో ఉన్న సంబంధాన్ని గురించి తెలుసుకుందాం. మొదట మీకు ప్రాణి లోకాల విభజనను గురించి వివరిస్తాను. అవి ఈ విధంగా ఉన్నాయి. –

**1. అరూప మరియు రూప బ్రహ్మ లోకాలు –**

ఈ లోకం, ఇంద్రియజన్య రాగద్వేషాది ప్రవృత్తులకు అతీతమైనది. వీరి చిత్తము, మహత్తరమైన నాలుగు గుణధర్మాలను కలిగి ఉంటుంది. అవి – అనంత మైత్రీ, అనంత కరుణ, అనంత ముదితా (ఇతరుల సఫలతను మరియు ఉన్నతిని చూసి ముదితులు కావటం) మరియు అనంత ఉపేక్షా. ఈ చిత్త ధర్మాల కారణంగా సర్వోత్తమ ప్రాణిలోకాలలో స్థాపితమయ్యే మానసిక శక్తులయిన అనంత నిర్మలత, తేజస్సు, విపుల ఆనందం, శాంతం మరియు తేలికైన, తీక్షణ మానసిక శక్తులు ఉద్భవిస్తాయి. అందుకే రూప బ్రహ్మలోకాల్లో భౌతిక పదార్థం అత్యంత సూక్ష్మంగా ఉంటుంది. ఇక్కడ కేవలం ప్రకాశం మాత్రమే ఉంటుంది. ఈ లోకాల్లోని ప్రాణుల శరీరాలు స్థూల భౌతిక పదార్థాలతో నిర్మితం కాకుండా కేవలం ప్రకాశాన్ని కలిగి ఉండటానికి ఇదే కారణం. అరూప బ్రహ్మలోకాల్లోనయితే భౌతికత లేశ మాత్రంగా కూడా ఉండదు.

**2. కామవాంఛల లోకాలు** – ఇందులో మూడు లోకాలు ఉంటాయి.

i. దైవలోకము
ii. మానవలోకము
iii. అథోలోకము

**i. దైవలోకము** – కొద్దిపాటి రాగంతో కూడిన మనోవాక్కయ కుశల కర్మల కారణంగా, ఎంతో నిర్మలత, తేజస్సు, మనోఆనందం మరియు తేలికైన తీక్షణ మానసిక శక్తులు సమకూరుతాయి. ఈ విధమైన మానసిక శక్తులు సంతరించుకున్నప్పుడు, వీటి కారణంగా స్థాపితమయ్యే దైవలోకాలలోని భౌతికపదార్థాలు కూడా చాలా సూక్ష్మంగా, ప్రకాశవంతంగా, ఆనందమయంగా, అత్యంత తేలికగా ఉంటాయి. కాబట్టే ఈ దైవలోకంలో నివసించేవారి శరీరాలు కూడా అత్యంత సూక్ష్మంగా, వాయువ్య శరీరాలుగా ఉంటాయి. వేరువేరు దేవలోకాలలోని దేవతల శరీర సూక్ష్మత, తేజస్సు, వర్ణలావణ్యము వారి వారి లోకాలకు అనుగుణంగా కొద్దిగా ఎక్కువగానో లేదా తక్కువగానో ఉంటాయి.

సాధారణంగా ఈ దేవతలు వారి వారి కుశల కర్మల కారణంగా సంతరించుకున్న మానసిక శక్తులు క్షీణమయ్యే వరకూ దైవలోకాల్లోని స్వర్గీయ ఆనందాలను అనుభవిస్తారు. ఆ తరువాత వీరిలో ఎక్కువ భాగం దేవతలు క్రింది లోకాల్లోనే పునర్జన్మ పొందుతారు. విశిష్టంగా వికసించిన ప్రాణుల విషయం దీనికి భిన్నంగా ఉంటుంది.

**ii. మానవలోకం** – మానవలోకం గురించి చర్చించే ముందు అథోలోకాల గురించి చర్చించాలి అనుకుంటున్నాను.

**iii. అథోలోకాలు –** అన్ని రకాల మనోవాక్కాయ అకుశల (ద్వేషపూరిత మరియు పాపపు) కర్మలు తమ స్వభావం కొద్దీ అపవిత్ర, అంధకారమయ, దహింపచేసే, బరువైన, కఠోరమైన అకుశల మానసిక శక్తులను తయారు చేస్తాయి. వీటిలో కూడా అన్నింటికంటే అపవిత్ర, అంధకారమయ, దహింపచేసే, గరిష్ఠ, కఠోర మరియు క్షుద్ర మానసిక శక్తులు, ఈ నాలుగు లోకాలలోనూ నిమ్నతమ లోకమైన ***నిరయ*** (నరకం) లోకంలో స్థానం పొందుతాయి. స్వభావం కొద్దీ ఈ లోకాలలోని భౌతిక పదార్థము కఠోరంగా, స్థూలంగా, దహించేదిగా, అప్రియమైనదిగా ఉంటుంది. తమ దుష్కర్మల ఫలితంగా ఇలాంటి అథోలోకాలల్లో జన్మించిన అన్ని ప్రాణులకూ ఇది వర్తిస్తుంది. మానవలోకం ఈ అథోలోకాల కంటే కొద్దిగా ఉత్తమమైనది. పశుపక్ష్యాదులు తప్ప ఈ అథోలోకాల్లోని ఏ ఇతర ప్రాణులూ సాధారణంగా కంటికి కనపడవు. కానీ, సమాధి శక్తి ద్వారా దివ్యశక్తిని సంపాదించుకున్న వాళ్ళు వీరిని తప్పకుండా చూడగలరు. ఇక్కడ శారీరిక, మానసిక దుఃఖాలే ప్రధానంగా ఉంటాయి. ఈ లోకాలు దైవలోకాలకు పూర్తి భిన్నంగా ఉంటాయి.

**ii. మానవలోకం –** ఇప్పుడు నేను మానవలోకాన్ని గురించి కొంత వివరిస్తాను. ఈ లోకం స్వర్గానికి, నరకానికి మధ్యలో ఉంటుంది. ఇక్కడ మనము సుఖము మరియు దుఃఖము రెండింటినీ అనుభూతి చెందుతాము. ఈ సుఖదుఃఖాల హెచ్చుతగ్గులు మనం గతంలో చేసుకున్న కర్మలపై ఆధారపడి ఉంటాయి. మన మానసిక స్థాయిని పెంచుకుని, దాని బలంతో ఊర్ధ్వలోకాల నుండి మన పూర్వసంచిత కుశల మానసిక శక్తులను ఆకర్షించి, వాటి నుండి బలాన్ని పొందవచ్చు. ఇక్కడ నుండే మనం దురాచారులమై దుష్టప్రవృత్తులు కూడబెట్టుకుంటే అథోలోకాలతో సంబంధం పెట్టుకున్నవారమవుతాము. ఇక్కడి నుండే మనం దురాచారము మరియు దుష్ప్రవృత్తుల అంచుల వరకూ వెళ్లి అథోలోక శక్తులతో సమం కాగలము. మానవలోకంలో ఊర్ధ్వలోకాల లాగా కేవలం సుఖం కానీ, అథోలోకాల లాగా కేవలం దుఃఖం కానీ ఉండవు. ఈ రోజు సజ్జనుడిగా ఉన్న వ్యక్తి రేపు దుష్టుడిగా మారవచ్చు. ఈ రోజు ధనవంతుడైన వ్యక్తి రేపు పేదవాడు కూడా కావచ్చు. ఇక్కడి జీవితంలో ఎన్నో ఆటుపోట్లు వస్తుంటాయి. ఎవరి స్థాయి కూడా మార్పు చెందనిది కాదు, స్థిరం కాదు. మానవులదయినా, కుటుంబాలదయినా, సమాజానిదయినా, దేశ పరిస్థితులదయినా సరే, మారుతూనే ఉంటుంది. అందరూ కర్మ సిద్ధాంతం యొక్క ఆధీనంలోనే ఉంటారు. కర్మ మనసులోనే ప్రారంభమవుతుంది. మనసు ఎల్లప్పుడూ మారుతూ ఉంటుంది కాబట్టి ***కర్మవిపాకం*** (కర్మఫలం) కూడా మార్పు చెందే స్వభావాన్ని కలిగి ఉండటం తప్పనిసరి.

గురుత్వాకర్షణ శక్తి కారణంగా భూమి తనవైపుకు ఏవిధంగా ఆకర్షించుకుంటుందో, అలాగే మనిషి కాళ్ళక్రింద విభిన్న దుష్ట మానసిక శక్తులు ఇమిడి ఉన్నందున, తనలో ఆశుద్ధత నిలిచి ఉన్నంత వరకూ ఈ క్రింది వైపుకు లాగే వాటి ఆకర్షణను సహించవలసిందే. సాధారణంగా జరిగేది ఇదే. మృత్యు సమయంలో తన మానసిక స్థితి అథోలోకాల మానసిక శక్తులతో జతకూడితే స్వాభావికంగా అదే లోకంలో తన పునర్జన్మ కలిగి, తన అకుశల కర్మల ఫలాలను అనుభవిస్తాము. మరోవైపు, ఒకవేళ మృత్యు సమయంలో తన మనోస్థితి మానవలోక శక్తులకు సంబంధించినదయితే, మరుజన్మ తిరిగి మానవ లోకంలోనే కాగలదు. ఒకవేళ మృత్యు సమయంలో అతని మనోస్థితి తన కుశల కర్మల స్మృతిలో గనక లీనమై ఉంటే, సాధారణంగా తన కుశల మానసిక శక్తుల ద్వారా ఆర్జించిపెట్టుకున్న కర్మల ఫలితాలను అనుభవించటానికి దైవలోకంలో జన్మిస్తారు. అదేవిధంగా మృత్యు సమయంలో మనసు పూర్తిగా నిర్మలంగా, ప్రశాంతంగా, ***కామ-రాగ-ఛందం*** నుండి ముక్తి పొంది ఉంటే, అతడు

బ్రహ్మలోకాన్ని చేరుకుంటాడు. ఈ విధంగా వ్యక్తుల కర్మలను బట్టి ఫలితాలు రావటం అనేది ఎంత పద్ధతి ప్రకారంగా ఎంత లెక్క ప్రకారంగా జరుగుతుందో మనకు బుద్ధుని బోధనల్లో సుతథ్యంగా, యదార్థంగా తెలుస్తుంది.

సజ్జనులారా! బుద్ధుని బోధనల సారమిదే. ఈ బోధనల వల్ల ఎవరికి ఎంత లాభం కలుగుతుందని తెలుసుకోవాలనుకుంటున్నారా? ఎవరు ఎంత వరకు ఆచరిస్తే అంత లాభం పొందుతారు. ఈ నియమము వ్యక్తులకు ఎలా వర్తిస్తుందో, అలాగే కుటుంబానికి, సమాజానికి, దేశానికి కూడా వర్తిస్తుంది. మేము గమనించింది ఏమిటంటే, కొద్దిమందికి ధర్మం పట్ల శ్రద్ధ ఉంది కాబట్టి బుద్ధునికి అనుయాయులయ్యారు, మరికొంత మంది ధర్మాన్ని ఆచరిస్తారు కాబట్టి బుద్ధుని అనుయాయులయ్యారు. అయితే ఎక్కువ మంది బుద్ధుని అనుయాయుల కుటుంబంలో జన్మించారు కాబట్టి తమను తాము బుద్ధుని అనుయాయులుగా చెప్పుకుంటారు. కానీ నిజానికి బుద్ధుని బోధనలను ఖచ్చితంగా పాటించే వారు మాత్రమే తమ మనోస్థితిని, దృష్టికోణాన్ని సరిచేసుకోగలరు. కేవలం పంచశీలాలను పాటించినా కొంత వరకు బుద్ధుని అనుయాయులుగా చెప్పుకోవచ్చు. బర్మాలోని బుద్ధ అనుయాయులందరూ కేవలం పంచశీలాలనే పాటించినా దేశంలో ఉన్న ఆంతరిక గృహ కలహము అంతమవుతుంది. కానీ ఇంకో సమస్య కూడా ఉంది. అది శారీరిక అవసరాలు తీర్చుకోవటానికి సంబంధించింది. ఎలాంటివారికైనా జీవితంలో కనీస అవసరాలు తప్పనిసరి. ఎక్కువ మటుకు ప్రజల ధోరణి– “వారికి జీవించటం కంటే విలువైనది మరేదీ లేదు” అన్నట్లు ఉంటుంది. కాబట్టి వారి జీవితాన్ని, వారి కుటుంబ సభ్యుల జీవితాలను కాపాడుకోవటానికి ఏ శాసన నియమాన్ని ఉల్లంఘించటానికి కూడా వెనుకాడరు– అది మహతరమైనా నియమమైనా, లేదా ప్రభుత్వ పరమైనదైనా సరే. కానీ వాళ్ళు మాత్రం, వర్తమాన జీవితంలో వాళ్ళు అనుభవిస్తున్న కష్టాలు, గతంలో ప్రోగుచేసుకున్న అకుశల చేతనలపైనే ఆధారపడి ఉంటాయి అని అర్థం చేసుకోరు.

కాబట్టి మానవ సమాజంపై ఆవహించిన అకుశల దుష్టశక్తులను ఎదుర్కోవటానికి వీలయినంత ఎక్కువగా శుద్ధమైన, కుశలమైన మానసిక శక్తులను వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ఈ పని అంత సులభం కాదు. ఒక సద్గురువు యొక్క సహాయం లేకుండా శుద్ధ మానసిక స్థితికి చేరుకోలేము. దుష్ట ప్రవృత్తులను ఎదుర్కోవటానికి ప్రభావవంతమైన శక్తులు కావాలంటే వాటిని ధర్మ మార్గం నుండే పొందగలము. ఆధునిక విజ్ఞానము మనకు మంచికో, చెడుకో అణుబాంబునయితే ఇచ్చింది. ఇది మనిషి తెలివితేటలతో సృష్టింపబడిన అతి పెద్ద అద్భుతం. అలానే ఇది అత్యంత భయంకరమైన ఆవిష్కారము కూడా. మనిషి తన మేధస్సును సరయిన దిశలో వాడుతున్నాడా? బుద్ధుని బోధనల ప్రకారం కుశల మానసిక శక్తులను నిర్మిస్తున్నాడా? లేక అకుశల శక్తులనా? మన మేధస్సును మనం ఏలాంటి విషయాలపై కేంద్రీకరించాలి, ఎలా కేంద్రికరించాలి అనేది మన ఇచ్ఛా శక్తి మీద ఆధారపడి ఉంటుంది. కేవలం బయటి పదార్థాలలోని అణుశక్తిపై విజయం సాధించడంలోనే మన మేధాస్సునంతా పెట్టాలా లేదా మనలో నిక్షిప్తమైన అణుశక్తిని, మనలోని అకుశల ఆంతరిక శక్తులపై విజయం ప్రాప్తించుకునే దిశగా ఎందుకు ప్రయత్నించకూడదు? తద్వారా మనకు ప్రాప్తించే ఆంతరిక శాంతిని ఇతరులకు కూడా వితరణ చేయవచ్చు. అంతేగాక మనలో పెంపొందే నిర్మలత మరియు శక్తివంతమైన మానసిక శక్తులను మనవరకే పరిమితం చేయకుండా, నలుదిశలా వ్యాపింపచేసి, మన చుట్టూ ఆవహించిన దుష్టవృత్తులను అడ్డుకోవటంలో సఫలురమవుతాము. ఎలాగయితే గదిలోని చీకటినంతటినీ పారద్రోలే సామర్థ్యం ఒక దీపానికెలా ఉంటుందో, అదే విధంగా ఒక వ్యక్తిలో ఉదయించిన ప్రకాశం, ఎంతోమందిలో ఉన్న అంధకారాన్ని తొలగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

హాని చేసే ఉపకరణాలతో మంచి జరుగుతుంది అని ఎవరైనా అనుకుంటే, వారి నమ్మకం కేవలం భ్రమనే, ఎండమావే. కొరియా దేశ విషయాన్నే తీసుకోండి, ఇరు వైపులా సుమారు పది లక్షల కంటే ఎక్కువ మంది మరణించి ఉంటారు. ఇంత జరిగినా శాంతికి సమీపంగా అయినా వెళ్ళగలిగారా? దీనితో మనం నేర్చుకునే గుణపాఠం ఏమిటంటే, ఇటువంటి సమస్యలకు సమాధానం ఒకటే – “మానవుని మనోవృత్తులను ధర్మం సహాయంతో మార్చుకోవాలి.” కేవలం భౌతిక పదార్థాలపైనే ఆధిపత్యం సాధించుకుంటే సరిపోదు, మనసుపై కూడా నియంత్రణ పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


| | | |
|---|---|---|
| రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** | **వివశ్యన తెలుగు మానవత్రిక** | జీవిత చందా రూ. **500/-** |
| ప్రచురణ తేదిః ప్రతినెల **30/31** | పోష్టింగ్ తేదిః ప్రతి నెల **1/2** | వెలః రూ **5/-** |

**వివశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**

If Undelivered please return to :


**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.